క్లుప్తంగా

మురికి కాలువ ఏర్పాటు


నీరు వెళ్లేందుకు తీసిన మురికి కాలువ

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో 'బురదమయంగా రోడ్లు' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బ్యాంక్ పక్క కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు వెళ్లేందుకు మురికి కాలువ తీయించి సమస్యను పరిష్కరించారు. ఎంపీడీవో మోహన్ పనులను పర్యవేక్షించారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న గ్రామస్తులు

జన్నారం: మండలంలోని ధర్మారంలో సోమవారం పోచమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ మగ్గిడి ప్రణవ్‌కుమార్ తన సొంత ఖర్చులతో ఆలయం నిర్మించగా, కట్ట నర్సింహ శాస్త్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వైభవంగా విగ్రహాన్ని ప్రతిష్టించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

యోగాసనాలతో ప్రసవం సులభం


యోగాసనాలు వేయిస్తున్న స్వరూపరాణి

జన్నారం: గర్భిణులు యోగాసనాలు చేయడం వల్ల ప్రసవం సులభమవుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ యోగా ఇన్‌స్ట్రక్టర్ రాథోడ్ స్వరూపరాణి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులతో యోగాసనాలు వేయించారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వాహనాలకు అనుమతివ్వాలి


ఎఫ్‌డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జన్నారం: గుడిహత్నూర్ నుంచి జన్నారం మీదుగా లక్సెట్టిపేట వరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 9గంటల వరకు భారీ వాహనాల రాకపోకలకు అనుమతివ్వాలని కోరుతూ సోమవారం ఫారెస్ట్ డివిజనల్ అధికారి రామ్మోహన్‌కు సామాజిక వేత్త భూమాచారి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ


సరుకులు పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల (టీఎస్ ఆర్ ఎస్, జేసీ)ను సోమవారం విద్యాశాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల విద్యాధికారి జె.పోచయ్య, జిల్లా డీసీఈబీ కార్యదర్శి పి.మహేశ్వరరెడ్డి గురుకులానికి వెళ్లి స్టోర్‌రూమ్‌లో భద్రపర్చి ఉన్న వంట సామగ్రిని, వసతులను నిశితంగా పరిశీలించారు. సరుకుల నాణ్యతను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. వంటగదిలో విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించి గురుకులంలో అవసరమైన వసతులు, విద్యార్థులు పడుతున్న ఇక్కట్లను విద్యాశాఖ అధికారికి నివేదిక రూపంలో అందజేస్తామని ప్రకటించారు. మెరుగైన వసతులతో విద్యార్థులకు విద్యనందించాలని గురుకుల ప్రిన్సిపాల్‌కు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిహారం.. పరిహాసం

- గోదావరి, ప్రాణహిత వరదలతో వేలాది ఎకరాల్లో పంట నష్టం
- నాలుగేళ్లపాటు రైతులను ముంచిన వైనం
- ఈ ఏడాది పొంచి ఉన్న ముప్పు
- పరిహారం కోసం తప్పని ఎదురుచూపులు

గత నాలుగు, ఐదేళ్ల క్రితం నష్టపోయిన పంటల వివరాలు..

మండలం	సంవత్సరం	రైతులు	పంట ఎకరాల్లో
కోటపల్లి	2019	1351	1554
కోటపల్లి	ఫిబ్రవరి2020	133	115
కోటపల్లి	ఆగస్టు2020	1664	4789
కోటపల్లి	2022	2833	6486
చెన్నూర్	2019	839	1182
చెన్నూర్	2020	107	168
చెన్నూర్	2022	2610	5400


చెన్నూర్ గోదావరి పరీవాహక ప్రాంతంలో వరద ముంపుతో నష్టపోయిన పత్తి పంట (ఫైల్)

చెన్నూర్: ప్రకృతి వైపరీత్యాలు ఏటా ఏదో విధంగా రైతులను ముంచుతున్నాయి. వరదలతో చెన్నూర్ గోదావరి, ప్రాణహిత నదుల పరీవాహక ప్రాంత రైతులు నాలుగేళ్లుగా నష్టపోతూనే ఉన్నారు. ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే రైతులను వరదలు కంటి మీద కునుకులేకుండా కాలం గడుపుతున్నారు. ఈ ఏడాది ఇప్పుడిప్పుడే పత్తి మొక్కలు మొలకెత్తుతున్నాయి. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రాణహిత నది ఉధృతి పెరిగితే ఈ ఏడాది సైతం పంటలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

ఎగువ కురిసిన వర్షాలతో...

గత నాలుగేళ్ల క్రితం వరదలు పంటలను నాశనం చేశాయి. 2019నుంచి 2021వరకు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగడంతో చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్ మండలాల్లోని పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల పంటలు నీటి పాలయ్యాయి. అప్పటి ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకుంటుందని ఆశ పడగా, రైతులకు పంటనష్ట పరిహారం పరిహాసంగా మారింది. పరిహారం రాకపోవడంతో పంటల కోసం చేసిన అప్పులు రైతులను వేధిస్తున్నాయి. 2023లో కాళేశ్వరం బ్యాక్ వాటర్ చెన్నూర్, జైపూర్, కోటపల్లి మండలాల్లో సుమారు 4వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి.

పంట చేతికొచ్చే వరకు...



గోదావరి పరీవాహక ప్రాంతంలో పంట చేస్తు ఉన్న ప్రతీరైతు దిగుబడి చేతికొచ్చే వరకు భయపడాల్సిందే. గత ఐదేళ్ల పంటలు తీవ్రంగా దెబ్బతిని నష్టపోయాం. పోయిన ఏడాది వరద ముంపు లేదు. ఈ ఏడాది ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు గోదావరి నదిలో నీటి మట్టం పెరిగింది. మరో రెండు రోజులు నీటి మట్టం పెరిగితే పరివాహక ప్రాంత పత్తి చేస్లు నీటి మునిగే అవకాశం ఉంది.

- మానిశెట్టి శ్రీనివాస్, రైతు, చెన్నూర్

పార్కు నిర్వహణ అధ్వానం


పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో వాకింగ్ ట్రాక్


పార్కులో పడేసిన వాటర్‌బాటిళ్లు, చిప్స్ ప్యాకెట్లు

- ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు
- రూ. 90లక్షల నిధులు వృథా

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని పాతమంచిర్యాలలో గల పార్కు అధ్వానంగా మారింది. రూ.90లక్షలతో వాకింగ్ ట్రాక్‌తో పాటు, ఆహ్లాదాన్ని పంచేలా మొక్కలు పెంచి, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. నిత్యం పాతమంచిర్యాలకు చెందిన వందలాది మంది వాకింగ్ చేయడంతో పాటు, కాసేపు సేద తీరేందుకు వస్తుంటారు. కొద్ది కాలంగా పార్కు నిర్వహణను కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైంది. వాకింగ్ ట్రాక్‌పై పిచ్చిమొక్కలు పెరగ్గా, చెత్తాచెదారం నిండింది. దీంతో వాకింగ్‌కు వచ్చేవారు రోజురోజుకు తగ్గిపోవడంతో, మందుబాబులకు అడ్డాగా మారింది. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో పలువురు పార్కులో మద్యం సేవించి, అక్కడే మందు, వాటర్ బాటిళ్లు, చిప్స్ ప్యాకెట్లు పడేస్తున్నారు. ఖాళీ మందు సీసాలను చెత్త ఏరుకునే వారు తీసుకెళ్తుండగా, వాటర్ బాటిళ్లు, ఇతరత్ర చెత్త అక్కడే ఉండిపోతుంది. స్థానికులు పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు పార్కు నిర్వహణపై ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సోమవారం ప్రజావాణిలో నేరుగా కలెక్టర్ కుమార్ దీపక్‌కు స్థానికుడు జి.సురేష్ కుమార్ ఫిర్యాదు చేశారు.

ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

జన్నారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సోమవారం పలువురు దరఖాస్తులు చేసుకోగా, తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

గోరింట వేడుక



మంచిర్యాలటౌన్: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని మంచిర్యాల పట్టణంలోని హైటెక్‌సిటీ కాలనీకి చెందిన మహిళలు హరిహర క్షేత్ర దేవాలయంలో గోరింట వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కాలనీకి చెందిన మహిళలు అంతా ఒక్కచోట చేరి గోరింటాకును తయారు చేసి, మహిళల చేతికి పెట్టుకున్నారు. గోరింటాకు పెట్టుకోవడం వల్ల మహిళలకు ఆరోగ్యం చేకూరుతుందని, ఏటా ఆషాఢమాసంలో పెట్టుకోవాలని సూచించారు.

సమస్యల్లో పశువైద్యశాలలు

- కత్తెరసాలలో సొంత భవనం కరువు
- శిథిలావస్థలో చెన్నూర్ ప్రాంతీయ పశువుల ఆస్పత్రి
- వర్షాలకు ఉరుస్తున్న పై కప్పులు
- ఆస్నాదలో ఒక వీఎల్‌వో, కత్తెరసాలలో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ


కత్తెరసాలలో అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న పశువైద్యశాల

చెన్నూర్‌రూరల్: పశువులకు వైద్య చికిత్స అందించే వైద్యశాలలకు సొంత భవనాలు కరువయ్యాయి. మండలంలోని ఆస్నాద, కత్తెరసాల ప్రాథమిక పశువుల ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఆస్నాదలో పశువైద్యశాలకు సొంత భవనం ఉండగా, కత్తెరసాలలో అంగన్‌వాడీ కేంద్ర భవనంలో కొనసాగుతోంది. ప్రస్తుతం ఆ భవనంలో పైకప్పున ఉన్న పెంకులు ఊడిపోయాయి. వర్షాకాలంలో ఊరుస్తుండడంతో కంప్యూటర్, తదితర సామగ్రిని చెన్నూర్‌లో ఉంచుతున్నారు. కత్తెరసాల ప్రాథమిక ఆరోగ్య పశువైద్యశాల పరిధిలో బుద్దారం, సంకారం, కన్నెపల్లి, అక్కెపల్లి, చింతలపల్లి, శివలింగాపూర్, లంబడిపల్లి, సుబ్బరాంపల్లి, రాయిపేట, నారాయణపూర్, దుగ్నెపల్లి, అంగ్రాజ్‌పల్లి, చెల్లాయిపేట, వెంకంపేట, పాగెపల్లి, సుందరసాల, కాచన్‌పల్లి, కమ్మరిపల్లి, తుర్కపల్లి, సుద్దాల గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల నుంచి రైతులు తమ పశువులను కత్తెరసాల పశువైద్యశాలకు వైద్యానికి తీసుకొస్తారు. అలాగే చెన్నూర్‌లోని ప్రాంతీయ పశువుల ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మహిళా సమాఖ్య భవనంలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. ఆస్నాదలో ఒక వీఎల్‌ఓ పోస్టు, కత్తెరసాలలో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకుని సొంత భవనాలు నిర్మించాలని పశువుల యజమానులు, కాపర్లు కోరుతున్నారు.

సొంత భవనం నిర్మించాలి



కత్తెరసాలలో పశువైద్యాలకు సొంత భవనం లేదు. వైద్యుడు ఉన్న భవనం లేకుండా పోయింది. అధికారులు పట్టించుకుని భవనం నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

- మల్లేశ్, రైతు, సుద్దాల

ఉన్నతాధికారుల దృష్టికి..



కత్తెరసాలలో పశువైద్యశాల సొంత భవనం లేదు. అంగన్‌వాడీ భవనంలోనే వైద్యశాలను నిర్వహిస్తున్నాం. భవనం పై కప్పు సరిగా లేదు. వర్షాకాలంలో ఊరుస్తుంది. నూతన భవనం నిర్మించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- సతీశ్, పశువైద్యుడు, కత్తెరసాల

సొంతింటి పథకం సాధిస్తాం


మాట్లాడుతున్న శంకర్ రావు

శ్రీరాంపూర్: కార్మికుల చిరకాల కోరికైన సొంతింటి పథకం సాధిస్తామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు తెలిపారు. ఎస్ఆర్పీ 1గనిపై సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సొంతింటి పథకం అమలు దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. దీనికోసం తమ యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అనేక సార్లు రాష్ట్ర ప్రభుత్వం పెద్దలతో, మంత్రులతో భేటీ అయ్యి చర్చించారన్నారు. కార్మికులకు అలవెన్స్‌లపై ఆదాయపన్ను యాజమాన్యమే చెల్లించేలా కృషి చేస్తున్నామన్నారు. గనులపై మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర నాయకులు గరిగె స్వామి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేసేందుకు కంట్రోల్ ఆఫ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్– తెలంగాణ కింద ఒప్పంద, గౌరవ వేతన పద్ధతిన పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సులేమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒప్పంద పద్ధతిన ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, గౌరవ వేతన పద్ధతిన సీనియర్ రెసిడెంట్ పోస్టును తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సృజనాత్మకతతో బోధించాలి

శ్రీరాంపూర్: విద్యార్థులకు సృజనాత్మకతో పాఠాలు బోధించాలని డీఈవో ఎస్.యాదయ్య తెలిపారు. పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా తీగల్‌పహాడ్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో అటల్ టేకరింగ్ ల్యాబ్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాలలో 100 అడ్మిషన్లను చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. నూతన విద్యార్థులకు ఆయన సమక్షంలో అడ్మిషన్లను అందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వామన్ రావు, సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ మూర్తి, విజయలక్ష్మి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు ప్రత్యేక కాలమ్ కేటాయించాలి

పాతమంచిర్యాల: జనాభా లెక్కల్లో ఆదివాసీలకు ప్రత్యేక కాలమ్ కేటాయించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు మతాలకు మాత్రమే కాలమ్ కేటాయించడంతో ఆదివాసీలు ప్రత్యేక గుర్తింపు పొందలేకపోతున్నారని తెలిపారు. జీవో నంబరు 49ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న, కార్యదర్శి ఎర్మ పున్నం, జిల్లా నాయకులు మల్లేశ్వరీ, రమేష్, మధునయ్య, రవి, స్వప్న, రజిత పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ జిల్లా చైర్మన్‌గా శ్రీపతి రాములు



శ్రీరాంపూర్: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్సీ) మంచిర్యాల జిల్లా చైర్మన్‌గా నస్పూర్‌కు చెందిన శ్రీపతి రాములు గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం కమిటీ స్టేట్ చైర్మన్ బద్దిపడగ శ్రీనివాస్‌రెడ్డి నియామక పత్రాన్ని జారీ చేశారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర కమిటీకి రాములు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మానవ హక్కుల రక్షణ కోసం, పేదలకు న్యాయం, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా రక్షకులుగా పని చేస్తానని తెలిపారు.

కాకా విగ్రహం ఏర్పాటు చేయాలి


ఎంపీ వంశీకృష్ణతో మాలమహానాడు నాయకులు

లక్సెట్టిపేట: పట్టణంలో దివంగత నేత, మాజీ మంత్రి కాకా వెంకటస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సోమవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను మాలమహానాడు నాయకులు కోరారు. దండేపల్లికి వెళ్తున్న సమయంలో స్థానిక ఐబీ ఆవరణకు వచ్చిన ఆయనకు వినతిపత్రం అందజేశారు. శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు దమ్మ నారాయణ, మల్లేశ్, గరిసె రవీందర్, మాలెం చిన్నయ్య, శాంతికుమార్, దమ్మ సునీల్, తిరుపతి, బాస్కర్, నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ కొలుపు

భీమారం: మండలంలోని ధర్మారం గ్రామంలో ఆదివారం రాత్రి పోచమ్మ కొలుపుని భక్తిశ్రద్ధలతో జరిపారు. తాండూరు మండలం అచ్చులాపూర్‌కి చెందిన పంబాల పూజారులు కొలుపు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షిప్త వార్తలు

అధికారుల తీరుపై నిరసన

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ అటవీ బీట్‌లో పోడు కోసం అటవీ భూముల్లో కొంతమంది ఆదివాసీ గిరిజనులు, చెట్లపొదలను తొలగిస్తుండగా గిరిజన మహిళలను అటవీ శాఖ అధికారులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసేందుకు తీసుకొచ్చారు. రాత్రివేళ బైండోవర్ చేయడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేసిన గిరిజన మహిళలు అధికారుల తీరుపై మండిపడ్డారు. తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. దీంతో బైండోవర్‌ను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండే చెప్పడంతో, గిరిజనులు ఇళ్లకు వెళ్లిపోయారు.

'దాడిని ఖండిస్తున్నాం'

పాతమంచిర్యాల: తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలకంటేశ్వర్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత అనుచరులు జాగృతి సభ్యులు మల్లన్న ఆఫీస్‌ను ధ్వంసం చేశారని, బీసీ సమాజం ఎదుగుదల ఓర్వలేక భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


యువతకు సన్మానం

వేమనపల్లి: తనకు సహకారం అందిస్తే నాటుసారా అమ్మకాలు గ్రామాల్లో లేకుండా చూస్తానని నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ అన్నారు. మండలంలోని ముల్కలపేట ఎస్టీ కాలనీలో గుడుంబా నిర్మూలనకు ముందుకొచ్చిన యువతను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సన్మానం చేశారు. తెల్లవారుజామున నెన్నెల మండలానికి దరావత్ చంద్ అనే వ్యక్తి బైక్‌పై 43లీటర్ల గుడుంబా ప్యాకెట్లతో గ్రామానికి వచ్చాడు. యువత సహకారంతో అతడిని పట్టుకునేందుకు యత్నించగా పరారయ్యాడు. గ్రామంలోని దాగామ బాపు అనే వ్యక్తికి అమ్మినట్లు గుర్తించారు. చంద్‌ను యువత సహకారంతో పట్టుకొని ఆరు ప్యాకెట్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గుడుంబా గ్రామంలోకి రాకుండా పహారా కాస్తున్న యువకులను శాలువాతో సన్మానం చేశారు.

'వడ్డెరలను అనుమతించకపోవడం సరికాదు'

జన్నారం: క్వారీలో బండలను కొట్టుకొని జీవనం సాగిస్తున్న వడ్డెరలను ఆ ప్రాంతం నుంచి బండ కొట్టుట నిషేధమని వెళ్లగొట్టడం చాలా దారుణమని మండల అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరాముల కొండయ్య పేర్కొన్నారు. క్వారీలో బండ కొట్టుకొనుటకు అనుమతివ్వాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు కోడూరి చంద్రయ్య, కడార్ల నరసయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, గూడ అశోక్, కాసెట్టి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ లేక ఇక్కట్లు



మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రతీరోజు సుమారు 600మంది విద్యార్థులు హాజరవుతారు. మధ్యాహ్న భోజన సమయంలో మైదానంలోనే కింద కూర్చుని భోజనం చేయడం ఇబ్బందికరంగా ఉంటుందని, వర్షం కురిస్తే మరింత అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని వెంటనే డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.